

పెండింగ్ చలానాలు చెల్లించాలి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

వాహనాలకు పెండింగులో ఉన్న చలానాలను వెంటనే చెల్లించి వాహనాలు సీజ్ కాకుండా చూసుకోవాలని ఏలూరు ట్రాఫిక్ సిఐ లక్ష్మణరావు తెలిపారు. నగరంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం చలానాలు చెల్లించకుండా తిరుగుతున్న వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. దీనిలో భాగంగా ట్రాఫిక్ సిఐ లక్ష్మణరావు, ట్రాఫిక్ సార్జెంట్ వెంకటేష్ సంయుక్తంగా పలు వాహనాలను తనిఖీ చేశారు. పెద్ద మొత్తంలో జరిమానాలు పెండింగ్లో ఉన్న వాహనదారులచే చలానాలు కట్టించారు. ట్రాఫిక్ సిఐ లక్ష్మణరావు మాట్లాడుతూ వాహనాలకు పెండింగ్లో ఉన్న చలానాలను ఎప్పటికప్పుడు చెల్లించాలని సూచించారు. చలానాలు అధికంగా ఉంటే వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. హెల్మెట్ ధరించి క్రమం తప్పకుండా వాహనాలను నడపాలన్నారు. పలువురు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆక్వా ఆశలు ఆవిరి..!

- 26 శాతం సుంకం విధింపుతో రొయ్య రైతుకు తీవ్ర నష్టం
- ధర పతనం కావడంతో అయినకాడికి అమ్ముకుంటున్న రైతులు
- సిఎం చంద్రబాబు ఆదేశాలతో 100 కౌంట్ రూ.220కు కొనుగోలు
- ధర మరింత తగ్గిపోతుందేమోనని ముమ్మరంగా పట్టుబడులు
- పరిస్థితి ఇలాగే కొనసాగితే క్రాప్ హాలిడే తప్పదంటున్న ఆక్వా రైతులు

ప్రజాశక్తి - భీమవరం

ఒకప్పుడు డాలర్ పంటగా పిలవబడిన రొయ్యల సాగు పరిస్థితి ప్రస్తుతం అగమ్యగోచరంగా మారింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆక్వా ఉత్పత్తులపై 26 సుంకం విధింపుతో ఆక్వా రంగం ఆశలు ఆవిరైపోతున్నాయి. ఇదే అదునుగా చూసుకుని ఆక్వా ఎగుమతిదారులు విపరీతంగా ధరలు తగ్గించారు. దీంతో రొయ్యల ధరలు పతనం కావడంతో రైతులు పంటను అయినకాడికే అమ్ముకుంటున్నారు. మరో రెండు రోజుల్లో ధరలు మరింత తగ్గుతాయనే ప్రచారం సాగడంతో రొయ్యల పట్టుబడులు ముమ్మరం చేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే క్రాప్‌హాలిడే తప్పదని రైతులు హెచ్చరిస్తున్నారు.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దుందుడుకు నిర్ణయాలు జిల్లాలోని ఆక్వా రైతులపై పెను ప్రభావం చూపుతున్నాయి. ట్రంప్ టారిఫ్ వార్‌కు ఇప్పటికే స్టాక్ మార్కెట్ పతనమైంది. దీంతో జిల్లాకు చెందిన పెద్దసంఖ్యలో ఇన్వెస్టర్లు కోట్లలో నష్టపోయారు. ముఖ్యంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఆక్వా ఉత్పత్తులపై 26 శాతం సుంకంతో ఆక్వా రంగంతోపాటు అనుబంధ రంగాలు కూడా దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 1.10 లక్షల ఎకరాల్లో రొయ్యల సాగు ఉంది. ప్రతియేటా నాలుగు లక్షల టన్నుల రొయ్యలు ఉత్పత్తి అవుతున్నాయి. దీనిలో సుమారు 3.5 లక్షల టన్నుల వరకు విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఆక్వా ఉత్పత్తులు అధికంగా ఎగుమతి అయ్యేది ఇక్కడి నుంచే. అటువంటి ఆక్వా రంగం ట్రంప్ నిర్ణయంతో అతలాకుతలమైంది. భారత సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతులపై అమెరికా ప్రభుత్వం విధించిన 26 శాతం సుంకం బుధవారం నుంచి అమల్లోకి రానుంది. ఈ నేపథ్యంలో ఎగుమతిదారులు చేతివాటం చూపిస్తున్నారు. వారు నిర్ణయించిన ధరలకే కొనుగోలు చేస్తున్నారు. అదీ మీకు నచ్చితేనే అమ్మండి, లేకపోతే లేదు అని రైతుల ముఖం మీద చెబుతున్నారు. ఇదిలా ఉంటే సుంకం విధించకముందే కొనుగోలు చేసిన రొయ్యలకూ తగ్గిన ధరల ప్రకారం సొమ్ము చెల్లిస్తామని చెబుతుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబు ఆదేశాలతో 100 కౌంట్ రూ.220కు కొనుగోలు

ఆక్వా రంగంలో ఏర్పడిన సమస్యలను ఆక్వా రైతులు మంత్రులు, ఎంఎల్‌ఎల ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు ఆక్వా ఎగుమతిదారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అమెరికా సుంకాల పేరుతో ఆక్వా రైతులకు వచ్చే ధర తగ్గించొద్దని కోరారు. 100 కౌంట్‌కు రూ.220 ధరగా నిర్ణయించారు. ఆక్వా రైతులు, నిపుణులు, ప్రభుత్వ అధికారుల భాగస్వామ్యంతో ఎంపెడా ప్రతినిధులు, ఎగుమతిదారులు 11 మందితో ఇప్పటికే కమిటీ కూడా ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఆక్వా రంగంలో ఏర్పడిన సమస్యలపై అధ్యయనం చేయనుంది. ప్రస్తుత పరిస్థితుల నుంచి ఆక్వా రైతులను గట్టెక్కించే దిశగా ఆలోచన చేసేందుకు చర్యలు ముమ్మరం చేస్తుంది. అదే క్రమంలో జిల్లాలో మంగళవారం వంద కౌంట్ రొయ్యలకు రూ.220 ధర ఇచ్చి ఎగుమతిదారులు కొనుగోలు చేశారు. అయినప్పటికీ తమకు క్వింటాకు రూ.20కుపైగా నష్టం వస్తుందని రైతులు వాపోతున్నారు.

అమెరికా విధించిన సుంకం అమల్లోకి

ఆక్వా ఉత్పత్తులపై అమెరికా విధించిన 26 శాతం సుంకం బుధవారం నుంచి అమల్లోకి వచ్చింది. అయితే ఇప్పటికే ఎగుమతిదారులు ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. 30, 40 కౌంట్ రొయ్యలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపించట్లేదు. ట్రంప్ ప్రకటన నాటి నుంచే వీటి ధరలను అమాంతంగా తగ్గించారు. ఈ రెండు కౌంట్ల ధరలు రూ.60 నుంచి రూ.100 వరకు తగ్గించేశారు. ప్రస్తుతం 60, 70 కౌంట్ రొయ్యలే కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అయితే సుంకం అమల్లోకి రాకమునుపే కొనుగోలు ఈ విధంగా ఉంటే అమల్లోకి వచ్చాక పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో ఒకటి, రెండు రోజుల్లో ధరలు మరింత తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని ప్రచారం సాగడంతో పట్టుబడులు ముమ్మరం చేశారు.

క్రాప్ హాలిడే దిశగా ఆక్వా రైతులు

సవాలక్ష సమస్యలతో సతమతమవుతున్న ఆక్వా రైతులకు అమెరికా విధించిన సుంకం కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. ఇప్పటికే ఆక్వా రైతులంతా రోడ్డుపైకెక్కి ఆందోళనలు చేపడుతున్నారు. అమెరికాలో 40, 50, కౌట్ రొయ్యలకు మాత్రమే సుంకం విధిస్తే ఇక్కడకు వేరే దేశాలకు వెళ్లే 100 కౌంటు రొయ్యలను విపరీతంగా ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఆక్వా రైతులంతా సమావేశాలు ఏర్పాటు చేసుకుని సమన్వయంతో ఒక నిర్ణయానికి వచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకటి, రెండు రోజుల్లో స్పందించి తమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే మూకుమ్మడిగా క్రాప్‌హాలిడే ప్రకటించేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరిస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

యర్రంశెట్టి శ్రీనివాస్, ఆక్వా రైతు, బాలేపల్లి



సీడ్ నాణ్యత ఉండట్లేదు. ఫీడ్ ధరలు అధికంగా ఉన్నాయి. సాగులో రకరకాల వైరస్‌లు వేధిస్తున్నాయి. వీటినుంచి ఇంకా కోలుకోక ముందే 26 శాతం సుంకం విధిస్తే ఎలా. ఇదే అదునుగా చేసుకుని ఎగుమతిదారులు వారు నిర్ణయించిన ధరలకే కొనుగోలు చేస్తామని చెబుతున్నారు. ఇప్పటికే ధరలు తగ్గించారు. మరో రెండు రోజుల్లో ధరలు మరింత తగ్గుతాయని చెబుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆక్వా రైతులను ఆదుకోవాలి. లేకపోతే ఆక్వా రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది.

గిట్టుబాటు ధర కల్పించాలి

కె.అప్పారావు, ఆక్వా రైతు, మోగల్లు



ఎన్నో ఏళ్ల నుంచి నేను నాలుగు ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నాను. ఎప్పుడూ ఇటువంటి పరిస్థితి రాలేదు. ఇప్పటికే అనేక సమస్యలతో సతమతమవుతున్నాం. ఈ సమయంలో సుంకం పేరుతో తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నాం. ఎగుమతిదారులు కూడా చేతివాటం చూపిస్తున్నారు. ఇలాగైతే సాగు చేయడం ప్రశ్నార్థకమే. ప్రస్తుత పరిస్థితుల్లో గిట్టుబాటు ధర కల్పిస్తే తప్ప రైతులకు మేలు జరగదు. ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోకపోతే ఆక్వా రైతుల పరిస్థితి దారుణంగా ఉంటుంది.



కలెక్టర్, ఎస్‌పి, జెసిలతో చర్చిస్తున్న మంత్రి పార్థసారథి

సిఎం పర్యటనా ఏర్పాట్లు పరిశీలన

11న ఆగిరిపల్లి సభకు జనం తరలిరావాలి
మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఈ నెల 11వ తేదీన ఆగిరిపల్లిలో పలు కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొంటారని, ఈ సందర్భంగా నిర్వహించే ప్రజా వేదిక సభకు ప్రజలు స్వచ్ఛందంగా హాజరై విజయవంతం చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు. బుధవారం ఆగిరిపల్లిలో సిఎం పర్యటనా ఏర్పాట్లను కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జిల్లా ఎస్‌పి కెపిఎస్.కిషోర్, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ తదితర అధికారులతో కలిసి మంత్రి పార్థసారథి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావుపూలే జయంతిని ఆగిరిపల్లిలో రాష్ట్రస్థాయి కార్యక్రమంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహిస్తారని, ఆ సభకు ప్రజలంతా స్వచ్ఛందంగా హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. నూజివీడు నియోజకవర్గంలో పలు సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

నూజివీడు టౌన్: ఈ నెల 11న ముఖ్యమంత్రి పర్యటనా ఏర్పాట్లను అధికారులందరూ సమన్వయంతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం సిఎం పర్యటనా ఏర్పాట్లపై జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్, జెసి పి.ధాత్రిరెడ్డి, సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, వివిధ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 11న నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లిలో ముఖ్యమంత్రి వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. హెలీప్యాడ్ ఏర్పాట్లను ఆర్‌అండ్‌బి అధికారులు గురువారం ఉదయం నాటికి పూర్తి చేయాలన్నారు. ముఖ్యమంత్రి శుక్రవారం ఉదయం హెలీకాప్టర్‌లో ఆగిరిపల్లి మండలం వడ్లమాను విచ్చేస్తారని, అనంతరం వివిధ కులవృత్తులకు సంబంధించిన కుటుంబాలను వారి పని ప్రదేశంలో కలిసి సమస్యలను అడిగి తెలుసుకుంటారన్నారు. అనంతరం ప్రజావేదికకు చేరుకొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారన్నారు. అనంతరం పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య రాకుండా చూడాలని, ఒఆర్‌ఎస్ ప్యాకెట్లను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రజావేదిక వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఇంటెలిజెన్స్ అదనపు ఎస్‌పి కృష్ణారావు, ఏలూరు జిల్లా ఎఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు, డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రొయ్యల రైతులను ఆదుకోవాలి: సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆక్వా రంగాన్ని కాపాడాలని, రొయ్యల రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాస్ సంయుక్తంగా బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అమెరికాలోని ట్రంప్ ప్రభుత్వం ప్రతీకార సుంకాల పేరుతో భారత్ ప్రభుత్వంపై పెట్టిన భారం ఫలితంగా ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా ఆక్వా రైతాంగంపై తీవ్రమైన ప్రభావం చూపిందని, తద్వారా రొయ్యల రైతులు నష్టాలకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా ట్రంప్ ప్రభుత్వం ఏప్రిల్ 6 నుండి 26 శాతం ప్రతీకార సుంకాలు విధించిన ఫలితంగా రొయ్యల ధరలు విపరీతంగా పడిపోవడంతోపాటు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ప్రభుత్వం కేవలం 100 కౌంట్ రొయ్యలు రూ.220కు కొనుగోలు చేయాలని నిర్ణయించినా వ్యాపారులు సిండికేటుగా మారి రూ.200కు మించి ఇవ్వడం లేదని తెలిపారు. వాస్తవానికి అమెరికా వంటి దేశాలకు 30, 40 కౌంట్లు కలిగిన రొయ్యలను మాత్రమే ఎగుమతి చేస్తుంటారని, అయితే ప్రభుత్వం మిగిలిన 30 నుండి 90 కౌంట్ కలిగిన రొయ్యల ధరలను ప్రకటించకపోవడం రైతాంగంలో గందరగోళం కలిగిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ధరకు వ్యాపారులు సిండికేట్ అయ్యి ధర తగ్గించడం, మిగిలిన వాటికి ప్రకటించకపోవడంతో ఆక్వా రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని తెలిపారు. కేంద్రంలోని మోడీ సర్కార్ దీనిపై స్పందించకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. తక్షణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రొయ్య రైతులకు న్యాయం చేయాలని కోరారు.

విద్యుత్ శాఖాధికారులపై చర్యలు తీసుకోండి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రవి

ప్రజాశక్తి - కుక్కునూరు

ప్రజలతో దురుసుగా వ్యవహరిస్తూ, అవినీతికి పాల్పడుతున్న విద్యుత్ శాఖాధికారులపై చర్యలు ఎందు కు తీసుకోవడం లేదని జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం చీరవల్లి గ్రామంలో యర్నం సాయికిరణ్ అధ్యక్షతన మండల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ గత నెల 11న అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న నర్సరీ యాజమాన్య వివరాల కోసం తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లిన సిపిఎం నాయకులు నాగేంద్రరావు విద్యుత్ అధికారుల నెంబర్ తీసుకుని ఫోన్ చేస్తే లైన్‌మెన్ అని చెబుతూ ఫోన్ మాట్లాడిన కంప్యూటర్ ఆపరేటర్ సుబ్బారావు చాలా దురుసుగా అవమానిస్తూ మాట్లాడారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని గతంలో తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చినప్పటికీ ఇప్పటికీ పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. ప్రజలతో మర్యాదగా నడుచుకోవాల్సిన సిబ్బంది, అవినీతికి పాల్పడుతూ, అడిగిన ప్రజా నాయకులను కించపరుస్తూ, బెదిరింపులకు పాల్పడుతూ మాట్లాడుతున్న ఎఇ పాపారావు, కంప్యూటర్ ఆపరేటర్ సుబ్బారావుపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేశామన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి నాగేంద్రరావు, మండల కార్యదర్శి భయ్యాన శ్రీను, సభ్యులు మేడిపల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్, పెట్రో ధరలు తగ్గించాలని కొనసాగిన నిరసనలు

ప్రజాశక్తి - పోలవరం

కేంద్ర ప్రభుత్వం ఎల్‌పిజి, ఉజ్వల పథకం గ్యాస్ సిలిండర్ల ధర రూ.50 చొప్పున పెంచి సామాన్యులపై భారాలు మోపడం దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్ ధరలు తగ్గించాలని బుధవారం వింజరం గ్రామ సచివాలయం వద్ద సిలిండర్‌తో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రజలందరికీ నిత్యావసరాల ధరలు పెరుగుతుంటే గ్యాస్ భారం మోపడం దారుణమన్నారు. ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగింపు చర్యలను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. మండల కార్యదర్శి కారం భాస్కర్ మాట్లాడుతూ వింజరంలో జిసిసి రేషన్ డిపో భవనం పూర్తిగా పాడైపోయిందన్నారు. గ్రామంలో శ్మశానవాటిక స్థలం లేక మృతుల కుటుంబాలు దహన సంస్కారాలకు నానావస్థలు పడుతున్నారని, చెరువు ప్రాంతాన్నే శ్మశానంగా ఉపయోగిస్తున్నారని తెలిపారు. గ్రామంలో తాగునీటి ట్యాంకు మరమ్మతులకు గురైందని, తక్షణం ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలని కోరారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సచివాలయ సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోలోజు నాగేశ్వరరావు, బొరగం భూచంద్రరావు, తామా బాలరాజు, టి.శాంతి, గోకూరి పాండవులు, కె.పోసిరత్నం, డి.సుబ్బాయమ్మ, గోకూరి రామకృష్ణ, ఇ.వెంకటేష్, పి.లక్ష్మి పాల్గొన్నారు.



పోలవరం మండలంలో...

నూజివీడు టౌన్: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరను తక్షణమే తగ్గించాలని, పెట్రోల్, డీజిల్ ఎక్సైజ్ డ్యూటీని తగ్గించి వినియోగదారులకు ఊరట కల్పించాలని సిపిఎం ఆధ్వర్యాన స్థానిక చిన్న గాంధీ బొమ్మ సెంటర్లో బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు మాట్లాడుతూ పెంచిన గ్యాస్ ధర తగ్గించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ఎన్‌ఆర్.హనుమాన్లు, నాయకులు శోభనాద్రి, వసంతరావు, పద్మాంజలి తదితరులు పాల్గొన్నారు.



నూజివీడులో...

ముసునూరు: పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. స్థానిక మండపం సెంటర్ వద్ద ఈ నిరసననుద్దేశించి ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు మాట్లాడుతూ వంట గ్యాస్ సిలిండర్ల ధరలను పెంపును ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో మోడీ ప్రభుత్వం మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాస్, కంచర్ల శివప్రసాద్, కంచర్ల దుర్గారావు, కంచర్ల భాష, తలకొండ శోభనాద్రి, కంచర్ల పోతురాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ముసునూరులో...

చింతలపూడి: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని సిపిఐ మండల కార్యదర్శి తుర్లపాటి బాబు డిమాండ్ చేశారు. స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో బుధవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో నేతలు కంచర్ల గురవయ్య, దొంత కృష్ణ, ఎస్‌కె.ఖాలేషా, తొర్లపాటి రాజు, ఎస్‌కె.మస్తాన్, ఎస్‌కె.లాల్, బి.మాణిక్యాలరావు, ఎం.శ్రీనివాసరావు, ఎం.వెంకటేశ్వరరావు, రామకృష్ణ, గట్టు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్: కేంద్రంలో మోడీషా సర్కార్ పెంచిన గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ న్యూడెమోక్రసీ, ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు యర్రా శ్రీనివాసరావు, కాకి నాని, దుళ్ల వీరినాయుడు, పల్లి గంగరాజు పాల్గొన్నారు.

మే 10న జాతీయ లోక్‌అదాలత్

కక్షిదారులు వినియోగించుకోండి
జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మే పదో తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ కోరారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఎఫ్‌ఎసి) ఎం.సునీల్‌కుమార్ ఆదేశాల మేరకు బుధవారం న్యాయ సేవాధికార సంస్థ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సంవత్సరం నాలుగు జాతీయ లోక్‌అదాలత్‌లు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఈ సంవత్సరం రెండో జాతీయ లోక్‌అదాలత్ మే 10న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనిలో రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్, సివిల్, కుటుంబ వివాదాలు, చెక్‌బౌన్స్, వాహన ప్రమాద బీమా, టెలిఫోన్ బకాయిలు, బ్యాంకు లావాదేవీల కేసులు పరిష్కరిస్తారని తెలిపారు. రాజీకి అనుకూలంగా ఉండి పరిష్కారం కాని కేసులను పర్మినెంటు లోక్‌అదాలత్ ఛైర్‌పర్సన్ ద్వారా మధ్యవర్తిత్వం నిర్వహించి రాజీ చేస్తారని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని కేసుల నుంచి విముక్తి పొందాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే 15100 లేదా 08812 224555కు ఫోన్ చేసి పరిష్కరించుకోవాలని కోరారు.

అటెండర్ల కొరత ఉన్నా సేవలందిస్తున్నాం

ఏలూరు సర్వజన ఆసుపత్రి అధికారులు - 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జనరల్ డ్యూటీ అటెండర్ల కొరత ఉన్నప్పటికీ ఉన్నవారితోనే సమర్థవంతంగా సేవలందిస్తున్నామని ఏలూరు సర్వజన ఆసుపత్రి అధికారులు తెలిపారు. బుధవారం సర్వజన 'ఆసుపత్రిలో సర్వం కష్టాలే' అంటూ 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన కథనానికి ఆసుపత్రి అధికారులు స్పందించి నోట్ రూపంలో వివరణ పంపారు. సర్వజన ఆసుపత్రిలో జనరల్ డ్యూటీ అటెండర్లు, ఎమర్జెన్సీ వార్డులు, ఎమర్జెన్సీ వద్ద షిఫ్ట్‌కు ఇద్దరు చొప్పున విధులు నిర్వహిస్తుంటారని పేర్కొన్నారు. ఎంసిహెచ్ బ్లాక్‌లో పిల్లల ఓపి, గర్భిణుల ఓపి, స్కానింగ్ గదులు ఉన్నాయన్నారు. గతంలో పేషెంట్ల కోసం వచ్చే బంధువుల కారణంగా గర్భిణులకు ఆపరేషన్ తర్వాత కుట్లు చీము పట్టడంతో వాటిని నియంత్రించటానికి మాత్రమే ఆసుపత్రి ఇన్ఫెక్షన్ కమిటీ సలహా మేరకు ఇతరులను తల్లీ బిడ్డ బ్లాక్‌లోకి రాకుండా నియంత్రిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం తాత్కాలికంగా బర్త్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు గదిని ఉపయోగిస్తున్నామని, త్వరలో తగిన గది ఏర్పాటు చేసి సర్టిఫికెట్లు కోసం వచ్చేవారికి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేరాల నియంత్రణకు కృషి చేయాలి : డిఎస్‌పి

జీలుగుమిల్లి : నేరాల నియంత్రణకు కృషి చేయాలని పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. బుధవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా స్టేషన్ల పరిధిలో ఇటీవల నమోదైన కేసులకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. డిఎస్‌పి మాట్లాడుతూ నేరాల నియంత్రణను తగ్గించేలా కృషి చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై దృష్టి సారించాలని ఆదేశించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐలు బి.వెంకటేశ్వరరావు, బాలసురేష్, ఎం.రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా అను హైస్కూల్ 25వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని మూలలంకలో అను హైస్కూల్ 25వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ప్రదర్శించిన వివిధ నాటకాలు, జానపద సాంఘిక నృత్యాలు ఆద్యంతం చూపరులను ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని కరస్పాండెంట్ ఎస్‌వి.రాఘవయ్య అన్నారు. పెడన ఎంఎల్‌ఎ కాగిత వెంకటకృష్ణ ప్రసాద్, అప్సా డెమోక్రటిక్ వ్యవస్థాపక అధ్యక్షులు మోహన్‌రావు, కార్యదర్శి కృష్ణ, నియోజకవర్గ అధ్యక్షులు ఎవి.కోటేశ్వరరావు, జివి.సత్యనారాయణరాజు, సర్పంచి మహాదేవ విజయబాబు, ఎంపిటిసి బాలు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

మిస్ తెలుగు యుఎస్ఎ అందాల పోటీల్లో
వీరవాసరం మండల యువతి చూర్ణికప్రియా

వీరవాసరం : అమెరికాలో తెలుగు వారు నిర్వహించే మిస్ తెలుగు యుఎస్ఎ అందాల పోటీల్లో వీరవాసరం మండలం చింతలకోటిగరువు పంచాయతీ పరిధిలోని నడపవారిపాలెం గ్రామానికి చెందిన కొత్తపల్లి చూర్ణిక ప్రియా తుది ఇరవై మంది జాబితాలో నిలిచింది. మహిళా సాధికారిత, మహిళల నాయకత్వం ప్రతిభ, తెలుగు వారి సాంస్కృతిక వారసత్వాన్ని తెలియజేస్తూ అమెరికాలో తెలుగు వారు అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ పోటీలను నిర్వహించుకుం టున్నారు. అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో యుఎస్ఎ 2025 అందాల పోటీల్లో మొత్తం ఐదు వేల మంది పాల్గొనగా ఇరవై మందిని ఫైనల్‌కు ఎంపిక చేశారు. తుది జాబితాలో వీరవాసరం మండలం యువతి ఉండడంతో ఆమె విజయాన్ని స్థానికంగా పలువురు కోరుకుంటున్నారు. అమెరికాలోని డల్లాస్‌లో మే 25న గ్రాండ్ ఫైనల్ జరగనుంది. చూర్ణిక ప్రియా ఈ అందాల పోటీలలో విజయం సాధించాలంటే తెలుగువారి ఓట్లే కీలకంగా ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారంతా ఈ ఓటింగ్‌లో పాల్గొనవచ్చు, అత్యధిక ఓట్లు సాధించినవారికి విజయం వరించే అవకాశం ఉంది. చూర్ణిక ప్రియా తండ్రి కొత్తపల్లి రాంబాబు కొత్తపల్లి భాస్కరావు సేవా ట్రాస్టు స్థాపించి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన ప్రస్తుతం హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. చూర్ణిక ప్రియా హైదరాబాద్ గీతం యూనివర్సిటీలో బిటెక్ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసి ప్రస్తుతం అమెరికాలో సెంట్రల్ ఫ్లోరిడా యూనివర్సిటీలో ఎంఎస్ కంప్యూటర్ సైన్స్ చదువుతోంది. శాస్త్రీయ నృత్యంలో ప్రావీణ్యం ఉన్న ఆమె సుమారు రెండు వందల వరకూ స్టేజ్ షోల్లో తన ప్రతిభను ప్రదర్శించింది. అందాల పోటీల్లో తన కుమార్తెకు విజయం చేకూరేలా గోదావరి వాసులంతా తమ ఓటుతో మద్దతు తెలియజేయాలని ఆమె, ఆమె తండ్రి రాంబాబు సోషల్ మీడియా వేదికగా కోరుతున్నారు.

ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఆరబెట్టిన ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు కేంద్రాలకు తరలించేలా రైతులకు అధికారులు సహకారం అందించాలని ఏలూరు ఆర్‌డిఒ డాక్టర్ అచ్యుత అంబరీష్ ఆదేశించారు. బుధవారం కైకరంలో జాతీయ రహదారి పక్కన ఆరబెట్టిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక సొసైటీ గోదాంలో గోనె సంచులను ఆయన పరిశీలించారు. తహశీల్దార్ పాలపర్తి రవికుమార్, డీటీ పూర్ణ, ఎఇ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం


పుస్తకాలు అందిస్తున్న దాతలు

బ్యాంక్ ఆఫ్ ఇండియా ధర్మగూడెం బ్రాంచి సౌజన్యంతో సుమారు రూ.ఐదు వేల విలువైన నోట్ పుస్తకాలు, ఇతర సామగ్రి పాఠశాల విద్యార్థులకు బుధవారం అందించారు. మేనేజర్ షేక్ రమీజ్ రాజా, అసిస్టెంట్ మేనేజర్ సీతారామయ్య ఆధ్వర్యంలో వీటిని అందించారు. ఈ సందర్భంగా సీతా నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అనేకమంది అనేక ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారన్నారు. తాము కూడా ప్రభుత్వ బడిలోనే చదివి ఈ స్థాయికి ఎదిగామని విద్యార్థులకు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.మురళీమోహన్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు పుస్తకాలు, స్టడీ మెటీరియల్ సహాయం చేసిన బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ షేక్ రమీజ్ రాజాకు కృతజ్ఞతలు తెలిపారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - దెందులూరు

మండలంలోని పోతునూరు పంచాయతీ ఉండ్రాజవరంలో బుధవారం ఉదయం దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ పర్యటించి గ్రామంలోని పలు చోట్ల సీసీ రోడ్ల నిర్మాణం సహా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎకు పార్టీ మండలాధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు) ఆధ్వర్యంలో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.

టిడిపి సభ్యత్వ కార్డుల పంపిణీ

బుట్టాయగూడెం :మండలంలోని బుసరాజుపల్లిలో బుధవారం నిర్వహించిన టిడిపి సభ్యత్వ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు హాజరయ్యారు. బుట్టాయగూడెంలో బుధవారం పార్టీ పోలవరం నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. అనంతరం టిడిపి సభ్యత్వ కార్డులను ఆయా గ్రామ నాయకులకు అందించారు.

సిమెంట్ రోడ్లు ప్రారంభం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం టౌన్‌లో అన్ని వార్డుల్లో నిర్మించిన సిమెంట్ రోడ్లను చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ నాయకులు గుమ్మడి ప్రసాద్, కె.కిషోర్, పి.సత్తిపండు, మున్సిపల్ కమిషనర్ కెవి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - టి.నరసాపురం

చిన్నారులకు పౌష్టికాహారం అందించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసిడిఎస్ చింతలపూడి ప్రాజెక్టు అధికారి పి.మాధవి తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జి.మణికుమారి అధ్యక్షతన పౌష్టికాహార పక్షోత్సవం కార్యక్రమంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాధవి మాట్లాడుతూ పౌష్టికాహార పక్షోత్సవం ఈ నెల ఎనిమిదో తేదీ నుంచి 22వ తేదీ వరకు ప్రతి అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖాధికారిణి ఎస్.కళ్యాణి, పంచాయతీల విస్తరణాధికారి బి.శ్రీనివాస్, సూపర్‌వైజర్లు ఎం.లక్ష్మి, జి.ఉషారాణి, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

భీమడోలు :ఐసిడిఎస్ భీమడోలు ప్రాజెక్టు, పూళ్ల సెక్టార్ పరిధిలో ప్రారంభమైన ఏడో పౌష్టికాహార పక్షోత్సవ కార్యక్రమాలు ఈ నెల 22వ తేదీ వరకు కొనసాగుతాయని, సెక్టార్ పర్యవేక్షకులు నూర్జహాన్ బేగం తెలిపారు. దీనిలో భాగంగా సెక్టార్ పరిధిలోని కురెళ్లగూడెం, ఇతర గ్రామాల్లో బుధవారం కార్యక్రమాలను నిర్వహించారు. దీనిలో భాగంగా సామూహిక సీమంతాలు చేపట్టారు. పురవీధుల్లో అవగాహనా ర్యాలీలను నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ పర్యవేక్షకులు మాట్లాడుతూ చిరుధాన్యాల వాడకం, పౌష్టికాహారం పట్ల అవగాహన, బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలు గురించి వివరించినట్లు తెలిపారు.

గృహ నిర్మాణ సాయం రూ.50 వేలు విడుదల

ఉంగుటూరు :గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఉపాధి హామీ చట్టంలో సకాలంలో మస్తర్లు వేయాలని ఉంగుటూరు మండల హౌసింగ్ ఎఇ సతీష్ కోరారు. ఉంగుటూరు ఎంపిడిఒ గంజి రాజు మనోజ్ ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇల్లు కట్టుకునే ఎస్‌సి, ఎస్‌టి, బిసి లబ్ధిదారులకు అదనపు సాయం ప్రభుత్వం అందిస్తుందని, ఈ విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే గృహ నిర్మాణాలు వేగవంతమయ్యేలా ఫీల్డ్ అసిస్టెంట్లు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎపిఒ ఖాజావలీ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ఏలూరు స్పోర్ట్స్ :ఎంఎస్‌సి విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఏలూరు రూరల్ పరిధిలోని మానూరు కాలనీలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. ఏలూరు రూరల్ పరిధిలోని మానూరు కాలనీ ప్రాంతానికి చెందిన తాడిశెట్టి వెంకటేష్ (24) రాజమండ్రిలో అగ్రికల్చరల్ ఎంఎస్‌సి చదువుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం తల్లిదండ్రులు లేచి చూసేసరికి అతను అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. అతని నోటివెంట పురుగుల మందు వాసన రావడంతో వెంటనే అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఏలూరు రూరల్ ఎస్ఐ దుర్గాప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై ఏలూరు రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు ప్రేమే కారణమా అన్న కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య మృతి కేసులో భర్త అరెస్ట్

ముదినేపల్లి :భార్య మృతికి కారణమైన భర్తను బుధవారం ముదినేపల్లిలో అరెస్ట్ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని వడాలి గ్రామానికి చెందిన గుండాబత్తిన తనుశ్రీ ఈ నెల ఏడో తేదీ ఉదయం ఇంట్లో అనుమానాస్పదంగా మృతి చెందింది. అల్లుడి వరకట్నం వేధింపుల వల్లే తన కుమార్తె చనిపోయిందని మృతురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు బెజవాడ అనిల్‌కుమార్‌ను డిఎస్‌పి డి.శ్రావణకుమార్ మధ్యవర్తుల సమక్షంలో ముదినేపల్లిలోని సహాయ మాత స్కూల్ దగ్గరలో అరెస్ట్ చేసి కైకలూరు మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. న్యాయమూర్తి నిందితుడికి రిమాండ్ విధించి జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని గేదె మృతి

2 గంటల పాటు నిలిచిన రైలు

మండవల్లి : రైలు గేదెను ఢీకొట్టిన సంఘటనలో గేదె మృతి చెందగా రైలు రెండు గంటల పాటు నిలిచిపోయింది. ఈ సంఘటన మండవల్లి-కైకలూరు 79వ గేటు సమీపంలో బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. భీమవరం రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మాచర్ల భీమవరం రైలు మండవల్లి స్టేషన్ నుంచి బయలుదేరి మండవల్లి కైకలూరు మార్గమధ్యంలో ఉన్న 79వ రైల్వే గేట్ సమీపానికి వచ్చేసరికి రైలు పట్టాలపై గేదె అడ్డు రావడంతో ఢీ కొట్టింది. దీంతో గేదె మృతి చెంది మూడో భోగి కింద ఇరుక్కుపోయింది. రైలు ఎయిర్ బ్రేకులకు సంబంధించిన డ్రమ్ము విరిగిపోవడంతో సుమారు రెండు గంటలపాలు అక్కడే నిలిపివేయాల్సి వచ్చింది. మరమ్మతుల అనంతరం రైలు అక్కడి నుంచి బయలుదేరింది. ఈ సంఘటనకు కారణమైన గేదె యజమానిపై శాఖాపరమైన కేసు నమోదు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని భీమవరం రైల్వే శాఖ సిఐ దస్తగిరి తెలిపారు.

దళితుల షాపులు తొలగించాలనడం దారుణం

దౌర్జన్యానికి పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలి
లేకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తాం
కెవిపిఎస్, సిపిఎం నేతలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం


మాట్లాడుతున్న కెవిపిఎస్, సిపిఎం నేతలు

అరటి పండ్లు, జ్యూసులు, కొబ్బరి బొండాలు అమ్ముకుంటున్న మండలంలోని వేగవరానికి చెందిన దళిత మహిళ షాపును తొలగించాలని కూటమి నేతలు దౌర్జన్యం చేయించడం సరికాదని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్, సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం అన్నారు. కూటమి నేతలు అనిశెట్టి వెంకన్న బాబు, దాకవరపు భానుమూర్తి, మోటేపల్లి దుర్గ, దాకవరపు వీరనాగయ్యలు దళిత మహిళ గంజి మరియమ్మ 30 ఏళ్లుగా అరటి పండ్లు, కొబ్బరిబొండాలు అమ్ముకుంటున్న షాపును తొలగించాలని వందమందిని తీసుకొచ్చి దౌర్జన్యం చేయించారన్నారు. వారిపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేయాలన్నారు. గతంలో వైసిపికి ఓటు వేశామనే కక్షతో తమపై వేధింపులకు పాల్పడుతున్నారని, తమను రాజకీయాల్లోకి లాగొద్దని దళిత మహిళలు మొత్తుకున్నా వినకుండా జంగారెడ్డిగూడెం పోలీసులు పొక్లెయిన్ తీసుకొచ్చి షాపులు తొలగించేందుకు చూశారన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని, దళితులకు రక్షణ కల్పించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చినప్పటి నుంచి దళితుల పట్ల తీవ్ర వివక్ష చూపుతున్నారని, వేగవరంలో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుని జీవిస్తున్న దళితులపై కక్ష సాధింపు చర్యలు చేస్తున్న నాయకులపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే దళిత ప్రజాసంఘాలను, వామపక్షాలను ఐక్యం చేసి చలో వేగవరానికి పిలుపునిచ్చి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధితులు కె.సుబ్బారావు, గంజి మరియమ్మ, కృష్ణ, రామారావు, బుడుపుటి నిర్మల కుమారి, నంబూరి వసంతరావు, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల పూర్తికి ప్రత్యేక కార్యాచరణ

భీమడోలు :మండలంలో గృహ నిర్మాణ సంస్థ ద్వారా చేపట్టిన నిర్మాణాలను, ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికా ప్రతిపాదనలను సిద్ధం చేసినట్టు భీమడోలు ఎంపిడిఒ పద్మావతి దేవి తెలిపారు. వచ్చే నెల 31వ తేదీలోగా గృహ నిర్మాణాల ప్రగతిని లక్ష్యం మేరకు పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా అమలు చేయనున్నటు చెప్పారు. ఈ మేరకు మేరకు లబ్ధిదారులను చైతన్య పరిచేందుకు గ్రామాల వారీగా డ్వాక్రా సంఘాలు, ఇతర శాఖల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం గుండుగొలను సచివాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమానికి గృహ నిర్మాణ సంస్థ భీమడోలు ఎఇ చైతన్య అధ్యక్షత వహించారు.

తొలకరి నాటికి అన్నదాత సుఖీభవ అమలు

దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని
పవర్ టెల్లర్లు అందించిన జెసి ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - దెందులూరు

కూటమి ప్రభుత్వం అంటేనే రైతుల ప్రభుత్వమని, జూన్‌లో వచ్చే తొలకరి నాటికి అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ప్రభుత్వ పెట్టుబడి సాయంగా రూ.20 వేలు అందిస్తామని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. మండలంలోని పోతునూరు, కొవ్వలి గ్రామాల్లో జరిగిన పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో జెసి ధాత్రిరెడ్డితో కలిసి దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాయితీ ద్వారా రైతులకు మంజూరైన పవర్ టెల్లర్లను జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డితో కలిసి రైతులకు అందించారు. అనంతరం పోతునూరు, కొవ్వలి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను జెసితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసి మిల్లర్లకు తరలించిన 24 గంటల్లోగా రైతుల ఎకౌంట్లో డబ్బులు జమ అయ్యేలాగా చేస్తూ కూటమి ప్రభుత్వం రైతులకు పూర్తిగా అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు, పలువురు టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, స్థానిక సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

ముసునూరు సర్వసభ్య సమావేశంలో వైస్ ఎంపిపి రాజానాయన

ప్రజాశక్తి - ముసునూరు




సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపిపి రాజానాయన

వేసవిలో నీటి ఎద్దడి నివారించేందుకు ప్రభుత్వ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కొండా దుర్గాభవాని, ఎంపిడిఒ జి.రాణి ఆధ్వర్యంలో బుధవారం ముసునూరు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన మాట్లాడుతూ గ్రామాల్లో వేసవి నీటి ఎద్దడి నివారణ చర్యల్లో భాగంగా చేతి పంపులు కొత్తవి అమర్చాలని, చెడిపోయిన వాటిని బాగు చేయించాలని, పైపులైన్లకు ఎక్కడా మరమ్మతులు లేకుండా ప్రజలందరికీ నీరు సరఫరా చేయాలని కోరారు. ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు మాట్లాడుతూ మండలంలోని 16 గ్రామాల్లోని 62 పాఠశాలల్లో ఏడు మోడల్ స్కూళ్ల అభివృద్ధి పనులు ప్రభుత్వం చేపట్టనున్నట్లు చెప్పారు. సర్వేపల్లి రాధాకృష్ణ సేవా మిత్ర ద్వారా ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు 3160 మంది విద్యార్థులకు టెస్ట్, నోట్ బుక్స్, యూనిఫామ్, షూస్, పరీక్ష పేపర్ బుక్‌లెట్ అన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇరిగేషన్ ఎఇ మాట్లాడుతూ గతంలో జల జీవన మిషన్ ద్వారా కొన్ని గ్రామ పంచాయతీల్లో 50 శాతం మిగిలిపోయిన పనులను ప్రస్తుతం ప్రభుత్వం వాటర్ గ్రిడ్ పేరట కృష్ణా నది జలాలు ముసునూరు మండలానికి తీసుకొచ్చే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వేల్పుచర్ల శివారు అన్నవనేనివారిగూడెంలో నూతన బోరు ఏర్పాటు, పైపులైను నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. జెడ్‌పిటిసి సభ్యులు ప్రతాప్ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం ద్వారా గ్రామాల్లో పశువులకు నీటి తొట్టెలు నిర్మాణం చేపట్టే సమయంలో ఆ గ్రామంలోని సర్పంచులకు, ఎంపిటిసిలకు, జెడ్‌పిటిసిలకు ప్రోటోకాల్ ప్రకారం తెలియపరచడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లోని చెరువుల నుంచి మట్టి తోలకాలు జరుగుతున్నాయన్నారు. తహశీల్దార్ కె.రాజకుమార్ మాట్లాడుతూ రాత్రిపూట తోలకాలు జరిగే సమయంలో తాము వెళ్లి తోలకాలు నిలిపివేస్తున్నామని, అనుమతులు ఉన్నాయంటూ ఫోను సమాచారం ఇస్తున్నారని, ఇకనుంచి అలా జరగకుండా చూస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మండల శాఖ అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం రైతులకు గోనెసంచులు అందించాలి

కల్లాల్లో తడిచిన ధాన్యాన్ని పరిశీలించిన రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - ఉంగుటూరు


ధాన్యాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నేతలు

అకాల వర్షం వల్ల కల్లాల్లో తడిచిన ధాన్యాన్ని రైతు సంఘం నాయకులు మండలంలోని కైకరంలో బుధవారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు మాట్లాడుతూ అకాల వర్షం వల్ల ధాన్యం తడిచి ఆరబెట్టడానికి బరకాలకు అదనపు ఖర్చులు అవడం వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సేవా కేంద్రాల ద్వారా వెంటనే గోనె సంచులు అందించి కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. వాతావరణ మార్పులతో కల్లాల్లో ఉన్న ధాన్యం తడవకుండా రక్షించుకోవడానికి ప్రభుత్వం రాయితీపై టార్పాలిన్లు అందించాలని కోరారు. తేమశాతం, తూకాలలో రైతులు ఇబ్బంది పడకుండా రైతు సేవా కేంద్రంలో నిర్ణయించిన తేమశాతం, తూకం ఆధారంగా రైస్ మిల్లుల్లో ధాన్యం దిగుమతి చేసుకోవాలని కోరారు. ఇక్రాప్‌లో కౌలు రైతుల పేర్లు నమోదు కాలేదని, వారి పేర్లతో ధాన్యం కొనుగోలు చేసి వారి బ్యాంకు ఖాతాలో నగదు జమ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కోన శ్రీనివాసరావు, జి.శ్రీరామమూర్తి, జి.సూర్యారావు, శానం వీరరాఘవులు, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వహణపై అవగాహన

భీమడోలు:గ్రామాలను పర్యావరణహితంగా, ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అందుబాటులో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల సేవలను వినియోగించుకోవాలని భీమడోలు ఎంపిడిఒ పద్మావతి దేవి కోరారు. భీమడోలులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద భీమడోలు, దెందులూరు మండలాలకు చెందిన గ్రామపంచాయతీ కార్యదర్శులకు, సిబ్బందికి కేంద్రం నిర్వహణపై రెండు రోజుల అవగాహన కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. కార్యక్రమాన్ని నిర్వహించిన భీమడోలు పంచాయతీ విస్తరణ అధికారి సుందరి, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల జిల్లా సమన్వయకర్త జి.ప్రసంగిరాజు మాట్లాడారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి కేంద్రాలకు తరలించాలని సూచించారు.

పారిశుధ్యాన్ని మరింత మెరుగుపర్చాలి

ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

బాధ్యతతో సమిష్టిగా పనిచేస్తేనే పారిశుధ్య పరిస్థితులు మరింత మెరుగయ్యేందుకు అవసరమైన అవకాశాలు పుష్కలంగా పెరుగుతాయని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి సూచించారు. బుధవారం శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్ కొనసాగింది. 5, 6 సర్కిళ్ల పరిధిలోని ఏడు డివిజన్లలో పనిచేస్తున్న సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలు, శానిటరీ సెక్రటరీలు, శానిటరీ మేస్త్రీలు, ఇతర సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బడేటి చంటి మాట్లాడుతూ ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో అపారిశుధ్య పరిస్థితుల వల్ల ప్రజలు ఎక్కడా అసౌకర్యానికి గురికాకుండా చూడడమే తన బాధ్యతన్నారు. ఈక్రమంలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాంన్నారు. విధులకు సక్రమంగా హాజరుకాని పారిశుధ్య సిబ్బందిపై వేటు తప్పదంటూ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, కార్పొరేషన్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, అదనపు కమిషనర్ జి.చంద్రయ్య, కో - ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, టిడిపి నాయకులు ఆర్నేపల్లి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి

పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఎస్‌సి మహిళల ఆర్థికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు అన్నారు. మండలంలోని బర్రింకలపాడు క్యాంపు కార్యాలయంలో కృషి ప్రధాన మంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ్ యోజన పథకంలో భాగంగా ఎస్‌సి మహిళలకు మంజూరైన రూ.ఐదు లక్షల చెక్కును జీలుగుమిల్లికి చెందిన డ్వాక్రా మహిళల గ్రూపునకు ఎంఎల్‌ఎ చేతులమీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సి మహిళల ఆర్థికభివృద్ధికి ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఎపిఎం ఝాన్సీ, సీసీ అరుణ, జనసేన మండలాధ్యక్షులు పి.రాము, నాయకులు రాజ్‌కుమార్, రమణ, వెంకాయమ్మ, సామ్రాజ్యం, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

చంద్ర రాజేశ్వరరావు ఆశయాలు ఆదర్శనీయం

వర్ధంతి కార్యక్రమాల్లో సిపిఐ నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

భూమి కోసం, భుక్తి కోసం దేశవ్యాప్తంగా సాగిన పోరాటాలకు నాయకత్వం వహించిన సిపిఐ అగ్ర నాయకులు, సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు ఆశయాలను, పోరాటాలను నేటి కమ్యూనిస్టులు ఆదర్శంగా తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య పిలుపునిచ్చారు. చంద్ర రాజేశ్వరరావు 31వ వర్ధంతి కార్యక్రమం సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం బండి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. రాజేశ్వరరావు చిత్రపటానికి కృష్ణచైతన్య, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే పూలమాల వేసి నివాళులర్పించారు. బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, నాయకులు పుప్పాల కన్నబాబు, కొండేటి బేబి, కడుపు కన్నయ్య, పల్లెం కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి : స్థానిక సిపిఐ కార్యాలయంలో చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల గురవయ్య మాట్లాడారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి తోర్లపాటి బాబు, సహాయ కార్యదర్శి దొంతా కృష్ణ, మండల కమిటీ సభ్యులు ఎస్‌కె కాలేశా, కౌన్సిల్ సభ్యులు తాడిగడప మాణిక్యాలరావు, చేపల్లి శ్రీనివాసరావు, ఎస్‌కె.మస్తాన్, ఎస్‌కె.లాల్, జిల్లా కోకన్వీనర్ తోర్లపాటి రాజు, రామకృష్ణ, మొగల శ్రీను పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : నూజివీడు టౌన్ సమితి ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ టౌన్ సెక్రటరీ చాట్ల పుల్లారావు, సిపిఐ టౌన్ నాయకులు పల్లె ప్రేమ్‌కుమార్, పి.ప్రవీణ్, టిడిపి పట్టణ ఉపాధ్యక్షుడు టి.ప్రదీప్‌కుమార్, చలసాని వీరభద్రరావు, ఒగ్గు ముఖర్జీ, రంగా, తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజ మార్గం

చింతలపూడి :రాజీ మార్గమే రాజమార్గమని చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు అన్నారు. స్థానికంగా బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చింతలపూడి, టి.నరసాపురం, లింగపాలెం, కామవరపుకోట మండలాల్లో దాదాపు నాలుగు వేలకు పైగా కేసులు ఉన్నాయన్నారు. వీటిలో సివిల్ కేసులన్నీ కూడా రాజీ పడేవే అని, కక్షిదారులు, బ్యాంకు వారు, పోలీసు వారు, రెవెన్యూ వారు వచ్చే పదో తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.